కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 50 (3 కేజీలు), పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 180.

రేపు హెచ్‌సీయూలో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ఈ ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్యవక్తగా డెన్మార్క్‌లోని ఆర్హస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ పాల్గొని 'ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడం ఎలా .. అనే అంశంపై ప్రసంగిస్తారు. ఈ సమావేశం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ బయాలజీ ప్రొ.అనిత జగోటా పర్యవేక్షణలో సాగుతుంది.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



మార్తాండనగర్‌కు చెందిన శివారెడ్డికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌కు చెందిన వెంకటశివారెడ్డికి వైద్యచికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.60 వేలు చెక్కును మంగళవారం ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ చౌదరి, కాశీనాథ్ యాదవ్, తిరుపతి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మాదాపూర్ డివిజన్‌లో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జగదీశ్వర్‌గౌడ్

మాదాపూర్: మాదాపూర్ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. మాదాపూర్ డివిజన్‌లోని జైన్ అపార్ట్‌మెంట్స్, మైస్కేప్ అపార్ట్‌మెంట్స్‌లలో నెలకొన్న సమస్యలను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానికులు, అధికారులతో కలిసి చేపట్టాల్సిన పనులను ఆయన పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

హనుమాన్ నగర్ బస్తీ సమస్యలు పరిష్కరించాలి

కూకట్‌పల్లి: హనుమాన్ నగర్ బస్తీలోని స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో బస్తీలోని స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, ఏ. రంగారెడ్డి, పోలయ్య, కృష్ణారావు పాల్గొన్నారు.



చందానగర్ గంగారంలో బస్సు కోసం ఎండలో నిలబడిన ప్రయాణికులు



మదీనాగూడ బస్టాప్ వద్ద మట్టికుప్పలు

ఎండలో నిల్చోలేకపోతున్నాం..

రోడ్డు విస్తరణలో బస్ షెల్టర్లు తొలగించి రెండేళ్లు

మియాపూర్: వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఎండలో రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తూ నానా అవస్థలు పడుతున్నారు. రహదారి విస్తరణలో బస్ షెల్టర్లు తొలగించడంతో ప్రత్యామ్నాయం కోసం వెదుకుతున్నారు. కనీసం తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

- చందానగర్, మదీనాగూడ, మియాపూర్ జాతీయ రహదారిపై ఉన్న బస్‌షెల్టర్లను తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల నిమిత్తం రోడ్డుకు ఇరువైపులా ఉన్న బస్ షెల్టర్లను నెలరోజుల కిందట పూర్తిగా తొలగించారు. దీంతో ప్రయాణికులు ఎండలో రోడ్డుపై నిలబడుతున్నారు.
- గంగారంలో ఉన్న బస్‌షెల్టర్‌ను సుమారు రెండు సంవత్సరాల క్రితం తొలగించారు. ఇప్పటి వరకు షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో వాన, ఎండలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూస్తున్నారు.

తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలి: ప్రయాణికుల విజ్ఞప్తి



మదీనాగూడ దీప్తిశ్రీనగర్ కాలనీ వద్ద ఎఫ్‌ఓబీ నీడలో నిలబడ్డ ప్రయాణికులు

- విస్తరణ పనుల దృష్ట్యా అధికారులు బస్‌షెల్టర్లను తొలగించిన క్రమంలో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. వేసవికాలం దృష్ట్యా అధికారులు తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.
- మియాపూర్, మదీనాగూడ, గంగారం జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై నిలబడుతున్నారు. ఎండ తాళలేక దుకాణాల ముందు ,చెట్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల కింద నిలబడుతున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఎండ తట్టుకోలేక అల్లాడుతున్నారు. కళ్లుతిరుగుతున్నాయని వాపోతున్నారు. ఇక కొన్నిచోట్ల బస్టాప్‌లలో ప్రయాణికులు కూర్చోవడానికి సరైన సౌకర్యాలు లేవు. మియాపూర్, బొల్లారం రోడ్డులో ఉన్న బస్టాప్ వద్ద ఆటోలు ఉంచుతుండడంతో బస్టాప్‌లో నిల్చోలేని పరిస్థితి ఉందని దీంతో రోడ్డుపై వేచిచూడాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి

చందానగర్, మదీనాగూడ జాతీయ రహదారిపై నెల రోజుల కిందట బస్ షెల్టర్లను తొలగించారు. పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మండుటెండల్లో నిలబడాల్సిన పరిస్థితి ఉంది. ఎండ తట్టుకోలేకపోతున్నాం. అధికారులు స్పందించి తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– ప్రయాణికుడు నరేష్

ఈ ఏడాది ఎస్కీలో 400 శిక్షణా కార్యక్రమాలు



'ఎస్కీ'లో వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్‌ను ఆవిష్కరించిన డైరెక్టర్ రామేశ్వరరావు

- 7వేల మంది అధికారులకు శిక్షణ
- 2025-26 వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్ ఆవిష్కరణ
- డైరెక్టర్ డాక్టర్.రామేశ్వరరావు వెల్లడి

రాయదుర్గం: ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించినట్లు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ఆధ్వర్యంలో 2025-26 వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 400 శిక్షణా కార్యక్రమాల ద్వారా 7వేల మంది అధికారులకు శిక్షణ ఇవ్వాలని తలపెట్టినట్లు ఆయన వివరించారు. ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్‌కు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు అవసరమవుతాయని సెమినార్లు, వర్క్‌షాపులు, విద్యాపరమైన పర్యటనలు, సదస్సులు, ఈ లెర్నింగ్ తదితరాల ద్వారా నేర్చుకుంటారన్నారు. జియో స్పేషియల్ సొల్యూషన్స్, స్మార్ట్ సిటీస్, గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత, కొన్ని ప్రాంతాల్లో నిర్మించే కట్టడాలపై సవాళ్ళు, 3 డీ ప్రింటింగ్ ఆవశ్యకత, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, 5 జీ, గ్రీన్ హైడ్రోజన్, డ్రోన్ టెక్నాలజీ తదితర అంశాలలో సుమారు 400 శిక్షణా కార్యక్రమాలను ఏప్రిల్-2025 నుంచి మార్చి-2026 వరకు 'ఎస్కీ' ప్రాంగణంలో నిర్వహిస్తామని వివరించారు. అనంతరం ఎస్కీ అధికారులు, ఉద్యోగులతో ఎస్కీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్కీ వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ కృష్ణప్రసాద్‌రావు, వెంకట్‌రెడ్డి, చంద్రకళ, పి శ్రీధర్,సాగర్, రాజారావు, సయ్యద్ అజ్గర్, భరత్, శ్రీధర్‌బాబు, లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, అనితాఅగర్వాల్, సాయికిషోర్, నరేష్, తిలక్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కేంద్రంలోని తాబేలుగుట్టపై నిర్మిస్తున్న జీవనజ్యోతిర్లింగ ఆలయ నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తాయి .మంగళవారం సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డి రూ.1.50 లక్షల విరాళంను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భోజిరెడ్డి, రాజేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో భారీగా పొడిచెత్త ఎత్తివేత



గచ్చిబౌలి: ఇనార్బిట్‌మాల్ సీఎస్ఆర్ పర్యావరణ కార్యక్రమంలో భాగంగా 6 ఆటోమేటెడ్ ఎలక్ట్రికల్ లిట్టర్ పికప్ యంత్రాలను ప్రవేశ పెట్టింది. నెలరోజుల్లోనే 24వేల లీటర్ల పొడిచెత్తను ఎత్తివేసింది. సైబరాబాద్ పట్టణ వ్యర్థాలను తగ్గించే దిశగా ఒక ముఖ్యమైన అడుగులో నిర్మాణ్ ఎన్‌జీఓ సంస్థ భాగస్వామ్యంతో జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి అధికారుల మద్దతుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని నిర్వాహకులు తెలిపారు. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్, మాదాపూర్‌లోని ఇనార్బిట్‌మాల్, దుర్గంచెరువు పార్కు, హైటెక్ సిటీ శిల్పారామం, హైటెక్‌సిటీ ఫుడ్ స్ట్రీట్స్, హైటెక్స్ ఆర్చ్ ,గచ్చిబౌలిలోని డీఎల్‌ఎఫ్ స్ట్రీట్ ఫుడ్ ఏరియా, రాయదుర్గం మెట్రో స్టేషన్ వంటి ప్రాంతాలలో ఈ యంత్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

గంజాయి స్వాధీనం

గచ్చిబౌలి: అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నానక్‌రాంగూడకు చెందిన సోనం(30)ఇంట్లో గంజాయి నిల్వ చేసి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో దాడి చేశారు. 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితురాలిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

6 బైక్‌లు స్వాధీనం

మియాపూర్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న యువకుడు, ఇద్దరు బాలురను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్‌లోని బండారి లేఅవుట్‌లో నివాసముంటున్న పి.ఇమాన్స్(20), అదే కాలనీకి చెందిన ఇద్దరు బాలురను స్నేహితులుగా చేసుకుని ఎవరూ లేకుండా చూసి ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లేవారు. ఈ నెల 7వ తేదీన మాధవనగర్‌కు చెందిన నర్సింహగౌడ్ ఇంటిముందు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లి వచ్చేసరికి వాహనం కనపడ లేదు. దీంతో నర్సింహగౌడ్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షణలో డిఐ రమేష్ నాయుడు బృందం దర్యాప్తు చేపట్టారు .ఇమాన్స్, బాలురను అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుండి 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇమాన్స్‌పై కూకట్‌పల్లి, ఆర్సీపల్లి, బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లలో వాహనాల చోరీ కేసులు నమోదై ఉన్నాయి. గతంలో దొంగతనం కేసులో ఇమాన్స్ అరెస్ట్ కాగా బాలురు జువైనల్ హోంలో ఉండి కౌన్సిలింగ్ తీసుకున్నారు. బయటకు వచ్చాక మళ్లీ దొంగతనాలకు పాల్పడడంతో ఇమాన్స్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. బాలురను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.



వేర్వేరు చోట్ల ఉరేసుకుని ముగ్గురు ఆత్మహత్య



రోహిత్ (ఫైల్)

మియాపూర్: నియోజకవర్గ పరిధిలో వేర్వేరుచోట్ల ముగ్గురు యువకులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మియాపూర్ సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వెస్ట్ గోదావరి పోదూరుకు చెందిన కడలి రోహిత్ కుమార్(24) తన స్నేహితులు సిద్దు, పవన్‌లతో కలిసి మియాపూర్‌లోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నారు. తోషిబాలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం రోహిత్ అనారోగ్య కారణంగా ఉద్యోగానికి వెళ్లలేదు. మిగతా స్నేహితులు సిద్దు, పవన్‌లు విధులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమయంలో స్నేహితుడు రోహిత్‌కు కాల్ చేయగా టాబ్లెట్ వేసుకున్నానని తగ్గిందని చెప్పాడు. విధులు ముగించుకుని వచ్చిన సిద్దు, పవన్‌లు తలుపు తీయమని ఎంత పిలిచినా ఉలుకుపలుకు లేకపోవడంతో తలుపులు పగుల కొట్టి లోపలికి వెళ్లి చూడగా రోహిత్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రోహిత్ ప్రేమ విఫలం కావడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది.

చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ..

చందానగర్: ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు...శేరిలింగంపల్లి నెహ్రూనగర్‌కు చెందిన మేకల నవీన్ (32) కాలికి గాయాలవడంతో ఉద్యోగానికి వెళ్లకుండా నెల రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. తల్లి, సోదరుడు సోమవారం ఉదయం 6.00 గంటలకు భువనగిరికి ఫంక్షన్‌కు వెళ్లారు. కాగా బాబాయి మల్లేష్ తన ద్విచక్ర వాహనం కోసం వచ్చి తలుపులు మూసి ఉండడం చూసి లోపలకు వెళ్లాడు. నవీన్ ఇంట్లోని ఐరన్ రాడ్‌కు తాడుతో ఉరేసుకుని ఉండడం గమనించి చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నవీన్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని సోదరుడు తెలిపారు.

మరోఘటనలో.. సెక్యూరిటీ గార్డ్

గచ్చిబౌలి: ఫోన్లో భార్యతో గొడవ పడి మనస్తాపానికి గురైన సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధ్యప్రదేశ్‌కి చెందిన గోల్‌యాదవ్(25) రెండు నెలల క్రితం నగరానికి వచ్చాడు.అంజయ్యనగర్‌లో నివాసముంటూ గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 6 గంటలకు విధులు ముగించుకొని రూమ్‌కి వెళ్ళాడు. రాత్రి 11 గంటలకు రూమ్ మేట్స్ వచ్చి చూడగా గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏదో విషయమై ఫోన్లో భార్యతో గొడవ పడినట్లుగా పోలీసులు భావించారు. మృతుడి బాబాయ్ ఇంద్రపాణియాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌లో 25 శాతం రాయితీ

- ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి
- ఎల్‌ఆర్‌ఎస్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించే విధంగా కృషి చేయాలని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో 1500 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు 25 శాతం రాయితీని పొందవచ్చని, ఫోన్ ద్వారా సమాచారం అందించి ఫీజులు చెల్లించే విధంగా చూడాలన్నారు. త్వరితగతిన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనధికార ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరోసారి కల్పించిన లే అవుట్ రెగ్యులైజేషన్ (ఎల్‌ఆర్‌ఎస్) పథకాన్ని ప్రకటించిందని, దీనిపై 25 శాతం రాయితీ ఇస్తున్నామని సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీపీఎస్ అధికారులు, జూనియర్ అసిస్టెంట్‌లు, న్యాక్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



టీఎన్‌జీఓ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీఎన్‌జీఓ కాలనీలో ఆయన స్థానికులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని నీటి సరఫరాను మెరుగుపర్చాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలని, పారిశుద్ధ్యంపై కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, క్రీడాప్రాంగణం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్‌రెడ్డి, డీఈ విశాలాక్షి, ఇతర అధికారులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో తీరిన నీటి సమస్య

నానక్‌రాంగూడ స్కూలుకు తాగునీటి ట్యాంకర్ పంపిన జలమండలి

రాయదుర్గం: నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాలలో నీటి సమస్య తీరింది. జలమండలి గచ్చిబౌలి సెక్షన్ డీజీఎం నరేందర్‌రెడ్డి మంగళవారం మంచినీటి ట్యాంకర్‌ను పంపారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు సంజీవరెడ్డి కలిసి పాఠశాలలో నీటి సమస్యపై డీజీఎంకు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో బోరు పని చేయడం లేదని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని కుళాయి కనెక్షన్‌కూడా ఇవ్వాలని వారు కోరారు. ఈ విషయమై డీజీఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్ పంపామని, అక్కడ సంపు చిన్నదిగా ఉందని వారం రోజులపాటు వాడుకోవచ్చన్నారు. నీటి సమస్య ఉందని సమాచారం అందిస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.



పాఠశాలలోని సంపులో నీరు నింపుతున్న దృశ్యం

పార్కు చుట్టూ ప్రహరీగోడ నిర్మించండి

ప్రజావాణిలో ఫిర్యాదు.. పార్కు స్థలాన్ని పరిశీలించిన ఉపకమిషనర్

చందానగర్: పార్కు కబ్జాకు యత్నిస్తున్నారని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, టీపీఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గాప్రసాద్‌లు చందానగర్‌లోని ఫ్రెండ్స్‌కాలనీ, డిఫెన్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ.. ఈ మూడు కాలనీలకు చెందిన పార్కు స్థలాన్ని స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్కు చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలనీవాసుల కోరిక మేరకు పార్కులో కనీస వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, వివిధ కాలనీలకు చెందిన అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మూడు కాలనీలకు చెందిన పార్కు స్థలాన్ని స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న డీసీ

తాగునీటి సమస్యను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలు కాలనీవాసులు మంగళవారం జలమండలి ఎండీఅశోక్ రెడ్డిని కలసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ కాలనీలకు తాగునీరు అందించేందుకు డెవలప్‌మెంట్ చార్జీల కింద లక్షలాది రూపాయలు చెల్లించాలని షరతులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వివరించామని.. ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



మియాపూర్‌లో మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకేఎన్‌క్లేవ్ కాలనీలో శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. కల్యాణోత్సవంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, బీకేఎన్‌క్లేవ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ,మహంకాళి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మియాపూర్‌లో రేణుక ఎల్లమ్మ., మహంకాళి ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాంచందర్, నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్, శ్రీనివాస్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.



బీకేఎన్‌క్లేవ్ కాలనీలో.. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ